
క్లుప్తంగా

తాటి ముంజలంటే ఇష్టం




నర్సంపేట : ప్రకృతి సహజంగా లభించే తాటి ముంజలను రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇష్టంగా తిన్నారు. చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేట గ్రామంలో మంగళవారం ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. ఇదే గ్రామానికి చెందిన గౌడ కులస్తుడు మేడి రాజగౌడ్ తాటి గెలలను తీసుకొని వచ్చి కోసి ముంజలను మంత్రి ప్రభాకర్‌కు ఇచ్చాడు. దీంతో ఆయన ముంజలు అంటే నాకు చాలా ఇష్టం, నేను ఒక గౌడ బిడ్డనేనని అన్నారు. ప్రకృతి ప్రసాదించే తాటి ముంజలను ప్రతిఒక్కరూ తిని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

సన్మానం



వర్ధన్నపేట : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్‌ను కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ ఇన్‌చార్జ్ అన్మిరెడ్డి కృష్ణారెడ్డి శాలువాతో సన్మానించారు. తొలుత పూల మొక్క బహూకరించారు. అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

'రేవూరి'కి..



గీసుకొండ : పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ అప్పిలేట్ అథారిటీ మెంబర్, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ గాదె దయాకర్ హనుమకొండలో మంగళవారం శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. తన నియామకానికి కృషి చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. నియామకం సందర్భంగా దయాకర్‌ను ఎమ్మెల్యే అభినందించారు.

ఏసీపీ రవీందర్‌రెడ్డికి..



నర్సంపేట : నూతన ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పున్నం రవీందర్‌రెడ్డిని స్థానిక స్వచ్ఛంద సంస్థల బాధ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే సామాజిక సేవలకు తోడ్పాటు అందించాలని, శాంతిభద్రతలను పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల సమాఖ్య అధ్యక్షుడు, ప్రతిభ సంస్థ నిర్వాహకుడు గిరిగాని సుదర్శన్ గౌడ్, స్వయంకృషి సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్, ఛాయా సంస్థ నిర్వాహకుడు కోట డేవిడ్, వాలంటీర్లు కాసుల వెంకటాచారి, మొగిలిచర్ల రాము, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ టాపర్‌కు అభినందన



దుగ్గొండి : మండలంలోని మహ్మదాపురం ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థి చవ్వాని మిన్ను పదో తరగతిలో 520 మార్కులు సాధించిన టాపర్‌గా నిలిచిన క్రమంలో ఆమెను హెచ్‌ఎం కాళిదాస్ స్కూల్ ఆవరణలో శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మిన్నుకు స్కూల్ పూర్వవిద్యార్థి ద్యాగం శివాజీ రూ.2,500 నగదు బహుమతి అందజేసి అభినందించారు. అనంతరం హెచ్‌ఎం కాళిదాస్ మాట్లాడారు. భవిష్యత్‌లోనూ చదువుల్లో రాణిస్తూ ఇతరులకు స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు గోగుల ప్రకాశ్‌రెడ్డి, ముద్రబోయిన రమేశ్, మేర్గు కట్టమల్లు, బండారి ప్రకాశ్, బుసాని ఏకాంబరం, పాలడుగుల కుమారస్వామి, పెంచాల సతీశ్, మహిపాల్, ప్రశాంత్, మహేశ్, చిరంజీవి, కరుణాకర్, పవన్, సంతోశ్, చరణ్, ప్రణయ్‌దీప్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగులు, డైరీల బహూకరణ



పర్వతగిరి : మండలంలోని సోమారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉపాధ్యాయుడు భరత్‌కుమార్ తన సొంత డబ్బుతో కొనుగోలు చేసిన స్కూల్ బ్యాగులు, డైరీలు మంగళవారం బహూకరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ గాయపు లింగారెడ్డి కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. విద్యార్థులకు బ్యాగులు, డైరీలు అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భరత్ కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో కొంకపాక జెడ్పీ హైస్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వెంచర్లు.. అడ్డగోలు అమ్మకాలు

- కొనుగోలుదారులకు భవిష్యత్‌లో ఇబ్బందులు ఖాయం..!
- జీపీలు, ప్రభుత్వ ఆదాయానికి గండి



రామచంద్రాపురం పరిధిలో గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తున్న భారీ వెంచర్

సంగెం : మండలంలో అక్రమ వెంచర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. రియల్టర్లు అధికారుల హెచ్చరికలను సైతం లెక్క చేయడం లేదు. ఆదాయపరంగా గ్రామపంచాయతీలకు, ప్రభుత్వానికి నష్టం వాటిల్లుతోంది. మండలంలో అనుమతి ఉన్న వెంచర్లు కేవలం ఐదు కాగా అనుమతి లేకుండా సుమారు 40–45 ఉన్నట్లు కనపడుతోంది. ఇదిలా ఉండగా సదరు వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వ్యక్తులు భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని మేధావులు, అనుభవజ్ఞులు స్పష్టం చేస్తున్నారు.

ప్లాట్లుగా మారుతున్న పంట భూములు

మండలంలోని పలు గ్రామాల్లోని పంట భూములు ప్లాట్లుగా మారుతున్నాయి. మండలంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, గుంటూరుపల్లి శివారులో నిర్మాణం కానున్న ఎయిర్‌పోర్టు పేరు చెబుతూ కాపులకనిపర్తి, ఆశాలపల్లి, రామచంద్రాపురం, తీగరాజుపల్లి, కాట్రపల్లి, గవిచర్ల తదితర గ్రామాల్లో రియల్టర్లు అక్రమంగా వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు. కొందరు నాలా పర్మిషన్ తీసుకుంటున్నా కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) అనుమతి తీసుకోకుండానే లేఅవుట్లు చేస్తున్నారు. ఇంకొందరు మరో అడుగు ముందుకేసి నాలా పర్మిషన్ సైతం తీసుకోకుండానే రైతుల నుంచి ఎకరాల్లో ప్లాట్లు కొనుగోలు చేసి లబ్ధిదారులకు గజాల లెక్కన అమ్ముతూ గుంటల ప్రాతిపదికన రిజిస్ట్రేషన్ చేయిస్తూ ప్రభుత్వాన్ని, కొనుగోలు కేంద్రాలను మోసగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

నిబంధనలకు పాతర..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం వెంచర్ చేయాలంటే వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకుని లేఔట్ రూపొందించి కుడా ప్రణాళికకు అనుగుణంగా రహదారులు ఏర్పాటు చేయాలి. సామాజిక అవసరాలకు భూమి కేటాయించాలి. తద్వారా కొనుగోలుదారులకు భరోసా కలగడంతోపాటు సంబంధిత గ్రామపంచాయతీలకు, ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. కాగా రాజకీయ ఒత్తిడి తీసుకొచ్చి, అధికారులను మచ్చిక చేసుకుని తమ ఇష్టారాజ్యంగా వెంచర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది.

జీపీల అనుమతి లేకుండానే భారీ వెంచర్లు

మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీల అనుమతి లేకుండా భారీ వెంచర్లు చేస్తున్న పరిస్థితి నెలకొంది. ఒకటి, రెండెకరాల నుంచి మొదలుకుని 42 ఎకరాల వెంచర్లు సైతం ఏర్పాటు కావడం గమనార్హం. గ్రామపంచాయతీల అనుమతి తీసుకోకుండానే ప్రీకాస్ట్, ఇటుక, రాయితో పర్మనెంట్‌గా ప్రహరీ నిర్మిస్తున్నారు.

విచారణ చేస్తాం



వెంచర్ల నిర్వాహకులు అధికారులకు ముందస్తుగా సమాచారం ఇవ్వడంతోపాటు అనుమతి తీసుకోవాలి. నిబంధనలు పాటించాల్సిందే. సొంత స్థలాల్లో, పంట పొలాల్లో.. ఎక్కడ వెంచర్లు చేసినా పంచాయతీల అనుమతి తప్పనిసరి. అనుమతి లేకుండా చేపట్టే నిర్మాణాలపై చర్యలకు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించాము. విచారణ చేపట్టి నిబంధనలు ఉల్లంఘించినట్లు నిర్ధారణ అయితే చర్యలు తీసుకుంటాం.

– కొమురయ్య, ఎంపీడీఓ

తెలంగాణ ఉద్యమంలో 'పాట' క్రియాశీలకం

- ప్రముఖ కవి, వాగ్గేయకారుడు యోచన



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న యోచన, కవులు

నర్సంపేట రూరల్ : తెలంగాణ ఉద్యమంలో ప్రజలను భాగస్వామ్యం చేయడంలో కవులు రచించిన పాటలు క్రియాశీలక పాత్ర పోషించాయని ప్రముఖ కవి, వాగ్గేయకారుడు యోచన తెలిపారు. ప్రముఖ కవి, రచయిత పడిదం రాజేందర్ రచించిన 'అస్మక రాజ్యమే నా తెలంగాణ' హిస్టారికల్ పాటకు సంబంధించిన వాల్‌పోస్టర్లను నర్సంపేట మండలంలోని మాధన్నపేటలో మంగళవారం యోచన ఆవిష్కరించి మాట్లాడారు. పాలకుల మోసపూరిత విధానాలతో నష్టపోయిన తెలంగాణ ప్రజలను పాటలు చైతన్యవంతం చేసి ఉద్యమానికి ఊపిరిలూదాయని చెప్పారు. కవులను సమాజం ఆదరించాలని కోరారు. గీత రచయిత రాజేందర్‌ను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో కవులు తాళ్ల సునీల్, జూపాక శివ, రొంటాల కుమార్, గాదెపాక బాబు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని అమీనాబాద్ మోడల్ స్కూల్ విద్యార్థులకు ప్రిన్సిపాల్ జ్యోతి మంగళవారం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చదువుల్లో రాణించాలని ఆకాంక్షించారు.

కొత్తగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు



గణాంకాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

గీసుకొండ : మండలంలో కొత్తగా ఐదు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటివరకు మండలంలో 52 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఒక్కో పోలింగ్ కేంద్రం పరిధిలో 1200 ఓటర్లకు మించకూడదు. కాగా మండలంలోని గొర్రెకుంట, మొగిలిచర్ల, మచ్చాపూర్‌ల్లో అంతకు మించి ఓటర్లు ఉండడంతో కొత్తగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. ఈ మేరకు తహసీల్దార్ రియాజుద్దీన్ ఆయా గ్రామాల్లో ఆర్‌ఐలు సాంబయ్య, శ్రీకాంత్‌లతో కలిసి మంగళవారం పర్యటించి పోలింగ్ కేంద్రాల ఏర్పాటును పరిశీలించారు. గొర్రెకుంటలో 2, మొగిలిచర్లలో 2, మచ్చాపూర్‌లో ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తారని తెలుస్తోంది.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని వినతి



నర్సంపేట : నర్సంపేటలోని అంబేడ్కర్ నగర్ గుడిసెవాసులు తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, జిల్లా కలెక్టర్ సత్యశారదకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఎంఎస్‌పీ, డీబీడీపీఎస్ నాయకులు కల్లెపల్లి ప్రణయ్‌దీప్, అందె రవి, తడుగుల విజయ్ సమస్యను వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేదలు సుమారు ఐదేళ్లుగా గుడిసెలు వేసుకుని కుటుంబాలతో జీవిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బోయిని నారాయణ, జలగం రమేశ్, మునిగె యాకోబు, దామెర సుధాకర్, మాదాసి బాబు, రాజుయాదవ్, రాజ్, వంశీ, వీరేశం, ఉప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

గ్రామకంఠం భూమిని కాపాడాలని..

పర్వతగిరి : మండలంలోని దౌలత్‌నగర్‌కు చెందిన సర్వే నంబర్ 424లోని 3.20 ఎకరాల గ్రామ కంఠం భూమిని కబ్జా నుంచి కాపాడాలని కోరుతూ గ్రామస్తులు తహసీల్దార్ భూభారతి సదస్సుకు హాజరైన వెంకటస్వామికి వినతిపత్రం అందజేశారు. 1995లో మండల కేంద్రానికి చెందిన చిదురాల ఉపేందర్ సదరు భూమిని కాజేసేందుకు యత్నించగా ఆర్డీఓ విచారణ చేపట్టి భూమి కొనుగోలు చేసినా చెల్లదని ప్రజల సమక్షంలో తేటతెల్లం చేశారని చెప్పారు. సదరు భూమిపై సర్వే చేయించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

స్కూళ్లలో వసతులు కల్పించాలని..

నల్లబెల్లి : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి మార్త నాగరాజు ఆధ్వర్యంలో ఎంఈఓ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం స్కూళ్లలోని సమస్యలను నాగరాజు అధికారికి వివరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సుధ ఉన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

- కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కుమార్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కుమార్, నాయకులు

నర్సంపేట : ఈనెల 22, 23 తేదీల్లో వరంగల్‌లో నిర్వహించనున్న కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా స్థాయి సామాజిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి ఆరూరి కుమార్ కోరారు. సంఘం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో శిక్షణ తరగతుల కరపత్రాలను పట్టణంలో మంగళవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక దళితులపై దాడులు విపరీతంగా పెరిగాయని తెలిపారు. రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని చెప్పారు. ఉద్యమాలు తప్పవన్నారు. కార్యక్రమంలో నాయకులు ధార మహేందర్, గణేశ్, నర్సింహరాములు, యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.

కట్టయ్య జీవితం ఆదర్శప్రాయం

- ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేటకు చెందిన కంచ కట్టయ్య జీవితం ఆదర్శప్రాయమని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. కట్టయ్య ఇటీవల మృతి చెందగా గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన యాది సభకు ఎమ్మెల్సీ దయాకర్ హాజరై మాట్లాడారు. సైన్స్ మనిషిగా కట్టయ్య కీర్తి సాధించారని కొనియాడారు. ప్రతి విషయాన్ని సైన్స్ పరంగా ఆలోచించే వారని గుర్తుచేశారు. సమస్యలకు సైన్స్ పరంగా పరిష్కారం చూపే వారని తెలిపారు. తొలుత కట్టయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కట్టయ్య సోదరుడైన ప్రొఫెసర్ కంచ ఐలయ్యను పరామర్శించారు.

నేడు కార్యకర్తల సమావేశం

ఖానాపురం : మండల కేంద్రంలో నేడు (బుధవారం) బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని రెడ్డి పెద్ద రంగారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

నివాళి



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేట గ్రామానికి చెందిన అన్నెబోయిన చందు మంగళవారం అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. చందు మృతి బాధాకరమన్నారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కంచ ప్రభాకర్, నాయకులు తాళ్ల సమ్మయ్య, ఉప్పరి కొమురయ్య, అబ్బదాసి సుధాకర్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు మహ్మద్ అమీరొద్దీన్, నాయకులు మేడి సంతోశ్, అబ్బదాసి యాకయ్య, కన్నం సందీప్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గీసుకొండ : అర్హులైన రైతుల నుంచి రైతు భరోసా కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏఓ హరిప్రసాద్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు రైతు భరోసా పొందని, అకౌంట్లలో లోపాలతో మంజూరు కాని రైతులు ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తు ఫారంతోపాటు ఆధార్ కార్డు, బ్యాంకు పాసు పుస్తకాల జిరాక్స్‌లు జత చేసి సంబంధిత క్లస్టర్ ఏఈఓలకు అందజేయాలని సూచించారు. ఈ ఏడాది జూన్ 5 నాటికి పట్టాదారు పాస్ పుస్తకం పొందిన రైతులు వానాకాలానికి రైతు భరోసాకు అర్హులని పేర్కొన్నారు. కొత్తగా పాస్ పుస్తకం పొందిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అనుమతులు లేకుండా బుక్‌స్టాల్ నిర్వహణ?

వర్ధన్నపేట : వర్ధన్నపేటలో అనుమతులు లేకుండా ఓ వ్యక్తి బుక్‌స్టాల్ నిర్వహిస్తున్నాడని విమర్శలు వస్తున్నాయి. ఓ ప్రైవేట్ స్కూల్ విద్యార్థులకు పుస్తకాలు అమ్మేందుకు యాజమాన్యంతో ఒప్పందం కుదుర్చుకొని స్టాల్ తెరిచాడని ఆరోపణలు వస్తున్నాయి. సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పరామర్శ



మృతుడి కుటుంబీకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

వర్ధన్నపేట : మండలంలోని దమ్మన్నపేటకు చెందిన మెరుగు రాజేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే నాగరాజు మంగళవారం కలిసి పరామర్శించారు. తొలుత రాజేశ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రభుత్వ సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ లీగల్ సెల్ వైస్‌చైర్మన్ నిమ్మాని శేఖర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజు, నాయకులు ప్రభాకర్ గౌడ్, వెంకన్న, మహ్మద్ చోటే, భానుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో బోధన



నర్సంపేట రూరల్ : చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీఓ మధురిమ, సూపర్‌వైజర్లు



నల్లబెల్లి : అక్షరాభ్యాసం చేయిస్తున్న సూపర్‌వైజర్



నెక్కొండ : అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈఓ

- ఐసీడీఎస్ సీడీపీఓ మధురిమ

నర్సంపేట రూరల్/నర్సంపేట/నల్లబెల్లి/ఖానాపురం/నెక్కొండ : అంగన్‌వాడీల్లో ఆటపాటలతో చిన్నారులకు విద్యాబోధన అందిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ మధురిమ, సూపర్‌వైజర్లు రమ, అరుణ, మాధవి, భాగ్యమ్మ, హేమలత, నజ్మా, ఎంఈఓ రత్నమాల తెలిపారు. నర్సంపేట, చెన్నారావుపేట, నల్లబెల్లి, ఖానాపురం, నెక్కొండ మండలాల్లోని అంగన్‌వాడీ సెంటర్లలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమాలకు వేర్వేరుగా వారు హాజరై మాట్లాడారు. ఐదేళ్లలోపు చిన్నారులందరినీ అంగన్‌వాడీ సెంటర్లలో చేర్పించాలని సూచించారు. పౌష్టికాహారం, తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో లభిస్తున్న సేవలను వినియోగించుకోవాలని కోరారు. అలాగే ఖానాపురం మండలంలోని ధర్మరావుపేటలో ర్యాలీ నిర్వహించగా నెక్కొండలో రావుల మధుకర్–రజిత దంపతుల కుమారుడు అరవింద్‌రెడ్డి జ్ఞాపకార్థం చిన్నారులకు పలకలు, బలపాలు, స్నాక్స్ అందించారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు ఉమ, రామకృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు అన్నపూర్ణ, విజయ, దేవేందర్, ఎస్తేర్, పార్వతి, వినోదరెడ్డి, శౌరీలు, నూనె కవిత, కూనమల్ల స్వరూప, భూక్య సరిత, రాధిక, సంధ్యారాణి, ధనలక్ష్మి, సునీత, వెంకటలక్ష్మి, భాగ్యలక్ష్మి, సువర్ణ, శరణ్య, రాణి, ఐలమ్మ, మంజుల, మంజుల, విజయలక్ష్మి, అరుణ, పంచాయతీ కార్యదర్శి బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

- బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట/నల్లబెల్లి : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నర్సంపేట నియోజకవర్గంలోని అన్ని స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు పోటీ చేస్తారని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. నల్లబెల్లి మండలంలోని ఆసరవెల్లికి చెందిన బీఆర్‌ఎస్ వార్డు మెంబర్లు పోరిక భద్రు, మహ్మద్ అలీతోపాటు పలువురు నాయకులు నర్సంపేటలోని కార్యాలయంలో పార్టీ నల్లబెల్లి మండల అధ్యక్షుడు తడుక వినయ్ గౌడ్, ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి యాదగిరి అధ్యక్షతన మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీలో చేరగా వారికి రాణాప్రతాప్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఇక నుంచి అన్ని ఎన్నికల్లోనూ యువతకు ప్రాధాన్యత ఇవ్వడానికి అధిష్టానం నిర్ణయించిందని తెలిపారు.

ప్రీ మెట్రిక్ హాస్టల్‌లో ప్రత్యేక సదుపాయాలు

- హాస్టల్ వెల్ఫేర్ అధికారి రవికుమార్



దరఖాస్తులు స్వీకరిస్తున్న రవికుమార్

పర్వతగిరి : మండలంలోని ఎస్సీ బాయ్స్ ప్రీ మెట్రిక్ హాస్టల్‌లో విద్యార్థులకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నట్లు హాస్టల్ వెల్ఫేర్ అధికారి కంజర్ల రవికుమార్ తెలిపారు. ప్రవేశాల కోసం మంగళవారం పలువురి నుంచి ఆయన దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. హాస్టల్‌లో సన్నబియ్యంతో భోజనం అందించడంతోపాటు పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్, ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం 3వ తరగతి నుంచి 7వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు నెలకు రూ.150, 8 నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు నెలకు రూ.200 చొప్పున కాస్మొటిక్ చార్జీలు ఇస్తోందని చెప్పారు. హాస్టల్‌లో నెలకోసారి విద్యార్థులు వైద్యశిబిరం ఏర్పాటు చేయడంతోపాటు ఉచితంగా దుస్తులు, పుస్తకాలు అందిస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు హాస్టల్‌లో ప్రవేశం పొందాలని కోరారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 9848920914, 7396285859ల్లో సంప్రదించాలని సూచించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



లబ్ధిదారుకు మంజూరు పత్రం ఇస్తున్న వీరస్వామి

నర్సంపేట : రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ పాతముగ్దుంపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు ననుమాన వీరస్వామి తెలిపారు. చెన్నారావుపేట మండలంలోని ఆ గ్రామంలో పలువురు లబ్ధిదారులకు మంగళవారం ఆయన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేసి మాట్లాడారు. లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. దశలవారీగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ అవుతాయని చెప్పారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో పేదలను విస్మరించిందని తెలిపారు. మొదటి విడతలో మంజూరు కాని పేదలు అధైర్య పడొద్దని కోరారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో పేదలందరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్‌లు సత్యం, కరుణాకర్, నాయకులు శంకేసి రంజిత్‌కుమార్, గుర్రం భిక్షపతి, జీపీ సిబ్బంది సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయి పనులకు పాల్పడితే చర్యలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్

నెక్కొండ : రైళ్లపై రాళ్లు రువ్వడం, ట్రాక్‌పై రాళ్లు పెట్టడం వంటి ఆకతాయి పనులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వరంగల్ గవర్నమెంట్ రైల్వే ఎస్సై వెంకటేశ్ స్పష్టం చేశారు. ఇటీవల వెళ్తున్న రైళ్లపై కొందరు రాళ్లు విసరడం, ట్రాక్‌పై రాళ్లు పెట్టడం జరిగిందని సమాచారం అందడంతో ఆయన విచారణ చేపట్టారు. రైల్వే ట్రాక్ సమీపంలో నివాసం ఉంటున్న ప్రజలకు మంగళవారం కౌన్సిలింగ్ చేశారు. రైల్వే ఆస్తులకు, ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తే కేసులు నమోదు చేసి చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా ఆకతాయి పనులకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని స్థానికులను కోరారు. కార్యక్రమంలో ఎస్సై మహేందర్, సిబ్బంది పాల్గొన్నారు.